క్లుప్తంగా

క్రిమి సంహారక మందుల పిచికారీ



పిచికారీ చేస్తున్న కౌన్సిలర్

కొడంగల్: కురుస్తున్న వర్షాలతో వ్యాధులు ప్రబలకుండా మున్సిపాలిటీ పరిధిలో క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. మంగళవారం పట్టణంలోని రెండో వార్డులో కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్ మున్సిపల్ సిబ్బందితో మురుగు కాల్వల్లో మందులను పిచికారీ చేయించారు. దోమలు, ఈగల వలన అంటురోగాలు సోకే ప్రమాదం ఉందని, ముందు జాగ్రత్తగా దోమల మందు, బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నట్లు పేర్కొన్నారు.

అధిక ధరలకు మాంసం విక్రయించొద్దు

దుకాణా దారులు పరిశుభ్రత పాటించాలి: జీపీ కార్యదర్శి



వ్యాపారులకు నోటీసులు అందజేస్తున్న కార్యదర్శి భాస్కర్

పెద్దేముల్: మాంసం విక్రయ దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించాలని, మటన్, చికన్ మార్కెట్ కంటే అధిక ధరలకు విక్రయించరాదని జీపీ కార్యదర్శి భాస్కర్ వ్యాపారులకు నోటీసులు అందజేశారు. ఇష్టం వచ్చిన ధరలతో పాటు రోగాల బారిన కోళ్ల, మేకల మాంసం విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని చెప్పారు. అలా చేయడం మోసం అవుతుందని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, దుకాణాలను మూసి వేయిస్తామని హెచ్చరించారు. మరోసారి అధిక ధరలు, కలుషిత మాంసం విక్రయించినట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన ఆపరేషన్ 'ముస్కాన్'



పట్టణంలో దుకాణాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

తాండూరు రూరల్: నెల రోజుల పాటు కొనసాగిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం ముగిసిందని కరన్‌కోట్ ఎస్‌ఐ–2 విమల చెప్పారు. మంగళవారం ఆమె ముస్కాన్ బృందంతో కలిసి నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు ఎస్పీ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు. తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, తాండూరు మండలంతో పాటు పట్టణంలో 51 మంది బాల కార్మికులను గుర్తించామని పేర్కొన్నారు. వారిని పని నుంచి విముక్తి కల్పించి, చదివించాలని తల్లిదండ్రులకు సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ అడ్వైజర్ నరేష్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

పాంబండ క్షేత్ర గిరిప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో మహిళా భక్తులు

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం బండవెల్కిచర్లలో శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో మంగళవారం గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి పౌర్ణమి రోజున ఆలయం చుట్టూ భక్తులు గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్న నేపథ్యంలో.. భక్తులు అత్యధిక సంఖ్యలో విచ్చేసి దేవస్థానం చుట్టూ శివనామస్మరణతో ప్రదక్షిణలు చేశారు. అనంతరం రామలింగేశ్వరున్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

ఎంపీడీఓ కార్యాలయానికి క్రీడా పరికరాలు

కొడంగల్ రూరల్: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలకు సంబంధించి క్రీడా పరికరాలు పంపిణీ చేసిందని ఎంపీడీఓ పాండు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయానికి దిగుమతి అయిన పరికరాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు సంబంధించిన కిట్స్ వచ్చాయని, త్వరలోనే సర్పంచులకు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

మతాల మధ్య చిచ్చు తగదు

కొడంగల్ రూరల్: మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయంగా లబ్ధిపొందేందుకు చూస్తున్న ఎంపీ సోయం బాబురావును బీజేపీ అధిష్టానం సస్పెండ్ చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ, లంబాడాల మధ్య గొడవలు పెట్టేందుకు కుట్ర చేయడం సరైందికాదన్నారు.

బయోమె'ట్రిక్స్'

- అమలు అంతంతే
- సమయపాలన పాటించని ఉపాధ్యాయులు
- సాంకేతిక సాకులు చూపుతూ హాజరు వేయని టీచర్లు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- విద్యార్థుల చదువుపై ప్రభావం



బాలంపేట పాఠశాలలో బయోమెట్రిక్ వేస్తున్న ఉపాధ్యాయులు

దౌల్తాబాద్: సర్కారు బడుల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా ప్రభుత్వం బయోమెట్రిక్ విధానం అందుబాటులోకి తెచ్చింది. అయినప్పటికీ.. చాలా మంది టీచర్లు అది అమలుకు నోచుకోకుండా బయోమె'ట్రిక్స్' ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. నెట్‌వర్క్ సమస్య, యంత్రాల మరమ్మతు తదితర కారణాలు చూపుతూ వాటిలో హాజరు వేయట్లేదు. సమయపాలన పాటించకపోవడంతో విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పర్యవేక్షించాల్సిన అధికారులు మామూలుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కరోనా తర్వాత గతేడాది ఆగస్టు నుంచి బయోమెట్రిక్ హాజరును ప్రారంభించినప్పటికీ రెండు మూడు నెలలు మాత్రమే వాటి పర్యవేక్షణ కొనసాగింది. తర్వాత ఏదో సాకు చూపుతూ వాటిని మూలన పడేస్తున్నారు. ఈ యంత్రాలు పనిచేసిన సమయంలో సమయపాలన పాటించేందుకు పరుగులు తీసిన పంతుళ్లు.. ప్రస్తుతం ఎప్పుడైనా వెళ్లొచ్చు అనే రీతిలో వ్యవహరిస్తున్నారు.

వ్యాపారాల్లో బిజీ..

చాలా మంది ఉపాధ్యాయులు వారికి నచ్చినప్పుడే బడికి వెళ్లడం.. మధ్యాహ్నం వరకే ఇంటిముఖం పడుతున్నారని, పలు రకాల వ్యాపారాలు చేసి, వృత్తికి ద్రోహం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఒకరిద్దరు ఉపాధ్యాయులు పనిచేసే చోట విధులకు వెళ్లినప్పటికీ సెలవుపత్రం సమర్పించకుండా డుమ్మా కొడుతున్నారు. మరుసటి రోజు హాజరుపట్టికలో సంతకాలు పెడుతున్నారు. పాఠశాలల్లో అందరూ ఒక్కటై వంతుల వారీగా డ్యూటీ చేస్తున్నారు. ఉపాధ్యాయులతో పాటు, బోధనేతర సిబ్బందికి సైతం యంత్రం ద్వారానే హాజరు అమలు చేశారు.

కొరవడిన పర్యవేక్షణ

కాడీడ్, చంద్రకల్, అంతారం, నాగసార్, బిచ్చాల, ఊరగుంట తదితర గ్రామాల పాఠశాలల్లో చాలా మంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంలేదని తెలుస్తోంది. బయోమెట్రిక్ పర్యవేక్షించాల్సిన స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, హెచ్‌ఎంలు పట్టించుకోకపోవడంతో డుమ్మా పంతుళ్ల ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతోంది. గతంలో అధికారులు ఉపాధ్యాయుల హాజరుపై నిత్యం పర్యవేక్షించేవారు. ప్రస్తుతం ఆ విషయంలో జోక్యం చేసుకోకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

"తప్పనిసరి



టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది బయోమెట్రిక్ ద్వారానే ప్రతి రోజు హాజరువేయాలి. మండలంలో ఈ విధానం కొనసాగుతోంది. అధికారుల పర్యవేక్షణ జరుగుతోంది. పలు పాఠశాలల్లో అప్పుడప్పుడు తనిఖీలు చేస్తున్నాను. ఉపాధ్యాయుల సమయపాలన పాటించాలి.

–వెంకటయ్య, ఎంఈఓ, దౌల్తాబాద్

ప్రజారోగ్యమే లక్ష్యం

పారిశుద్ధ్య పనుల్లో శ్రమిస్తున్న కార్మికులు

వరుస వర్షాల నేపథ్యంలో మునిసిపాలిటీలో పారిశుద్ధ్యం పడకేసింది. చెత్త కుప్పలు పేరుకుపోయాయి. మురుగు కాలువలు ముందుకు సాగని దుస్థితి. అసలే సీజనల్ వ్యాధుల కాలం. ఆపై లోపించిన పారిశుద్ధ్యంతో పుర ప్రజలు అసౌకర్యానికి గురవుతున్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో 'సాక్షి' ముఖాముఖి.



SAKSHI INTERVIEW సాక్షి

- మురుగు కాలువలు, రోడ్ల నిర్మాణం చేపడుతున్నాం
- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు
- మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

కొడంగల్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన మునిసిపాలిటీ పరిధి పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తాయి. పరిసరాల అపరిశుభ్రతతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ఆ సమస్యలను ఎలా పరిష్కరిస్తున్నారు?

కమిషనర్: పారిశుద్ధ్య కార్మికులు నిత్యం విధి నిర్వహణలో ఉన్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. పుర ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపడుతున్నారు. ఎప్పటికప్పుడు చెత్తాచెదారం తొలగిస్తున్నారు. మురుగు కాల్వలు సాఫీగా సాగేలా శ్రమిస్తున్నారు.

ప్రశ్న: కొడంగల్‌లో రోడ్లు అధ్వానంగా మారాయి. మరమ్మతుల గురించి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: మిషన్ భగీరథ పైపులైన్ల కోసం రోడ్లను తవ్వారు. వాటి మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కొత్తగా రహదారులను నిర్మిస్తున్నాం.

ప్రశ్న: పలు కాలనీల్లో మురుగు కాల్వలు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: టీయూఎఫ్‌ఐడీసీ నిధుల నుంచి పట్టణంలో మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాం. రహదారులు పూర్తయిన తర్వాత పూర్తిస్థాయిలో మురుగు కాల్వల నిర్మాణ పనులు కొనసాగుతాయి.

ప్రశ్న: పట్టణంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందా?

జ: కొడంగల్‌లో బాగా ట్రాఫిక్ పెరిగింది. కౌన్సిల్ మీటింగ్‌లో ప్రతిపాదిస్తాం.

ప్రశ్న: విలీన గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు ఉన్నాయి. ఎలా పరిష్కరిస్తున్నారు.

జ: మున్సిపల్‌లో ఆరు గ్రామాలు విలీనమయ్యాయి. వాటిల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాం. చెత్తాచెదారం తొలగిస్తున్నాం.

ప్రశ్న: ప్రధాన రహదారిపై జరుగుతున్న ప్రమాదాలను ఎలా నివారిస్తారు?

జ: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారితో పాటు కొడంగల్– మహబూబ్‌నగర్ రోడ్డుపై సిగ్నల్స్ లేకపోవడం వలన యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. ఈ విషయంలో పోలీస్ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఎట్టణంలో పార్కుల పరిస్థితి ఏమిటి?

జ: లాహోటీ కాలనీలో పార్కు ఏర్పాటు చేశాం. మిగతా కాలనీల్లో ఏర్పాటుకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న: చెత్త సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి. దీనికి మీరు ఏమంటారు?

జ: మునిపాలిటీ పరిధిలోని ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా నిరంతరం చెత్త సేకరించి, తొలగించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం. కొత్తగా మరి కొన్ని ఆటోలు, ట్రాక్టర్ల అవసరం ఉంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



గాలికుంటు టీకాలు వేస్తున్న వైద్యాధికారి

- రైతులు పశు సంపదను కాపాడుకోండి
- ముందు జాగ్రత్తగా టీకా తప్పనిసరి
- పశు వైద్యాధికారులు

దౌల్తాబాద్: సీజనల్ వ్యాధుల పట్ల పశువుల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి వరలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెల నట్టల నివారణ, గాలికుంటు వ్యాధి నివారణ మందుల పంపిణీ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా దౌల్తాబాద్, గోకఫసల్‌వాద్‌లో 447 పశువులకు, 184 బర్రెలకు టీకాలు వేశామన్నారు. ప్రస్తుతకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది అన్వర్, సాయిబాబు, జహీర్‌ఖాన్, సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.



పెద్దేముల్: వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ వెంకటపతిరాజు

పశువులకు టీకా తప్పనిసరి

పెద్దేముల్: పశువులకు రైతులు గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరిగా ఇప్పించాలని పెద్దేముల్ పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటపతి రాజు అన్నారు. పెద్దేముల్ మండలం గోట్లపల్లి, పెద్దేముల్‌లో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఆవులు, బర్రెలు, ఎడ్లకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని, మూగజీవాలు రోగాల బారిన పడకుండా ముందస్తుగా టీకా ఇప్పించాలని సూచించారు. మొత్తం 275 పశువులకు టీకా వేశామని వెల్లడించారు. రైతులు పశువులకు టీకాతో పాటు వాటిని గుర్తించేందుకు చెవులకు పోగులు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మోహన్ రావు, చంద్ర శేఖర్, ఇమ్రాన్, పర్వేర్, సిద్దిక్, రైతులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కొడంగల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పాండు తెలిపారు. సమీక్షకు మండల పరిధి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని చెప్పారు. ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు.

పంటలకు పరిహారం చెల్లించండి

కొడంగల్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ వికారాబాద్ జిల్లా ప్రచార కార్యదర్శి తలారీ శేఖర్ కోరారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కంది, పత్తితో పాటు పలు రకాల పంటలకు నష్టం జరిగిందని, ఎకరాకు రూ.20వేలు నష్ట పరిహారం ఇవ్వాలని, అదే విధంగా వరద ముప్పుతో ఇబ్బంది పడుతున్న ప్రజల ఇబ్బందులపై స్పందించి, తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

దోమల నుంచి విముక్తి

తాండూరు రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఓగిపూర్ సర్పంచ్ పద్మమ్మ కోరారు. మంగళవారం గ్రామంలో హైపోక్లోరైడ్ పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. హైపోక్లోరైడ్ పిచికారీ వలన దోమల నుంచి విముక్తి లభిస్తుందని చెప్పారు.

టీటీడీ కల్యాణ మండపాలు మంజూరు



ఈవోకు డీడీలు అందజేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

నవాబుపేట: నవాబుపేట, చేవెళ్లకు తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపాలు మంజూరు చేయడంపై టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య చెప్పారు. ఒక్కో మండప నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయని, అందుకు సంబంధించిన రూ.80 లక్షల డీడీలను టీటీడీ ఈవో ధర్మారెడ్డి అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట నవాబుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, బీ ఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ప్రభాకర్, ఆనంద్ రెడ్డి ఉన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న కార్మికులు

- సమస్య పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి
- సీఐటీయూ డిమాండ్

తాండూరు టౌన్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రజాప్రతినిధులు స్పందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా కార్మికులు మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులకు మద్దతుగా శ్రీనివాస్ మాట్లాడారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచి, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. అంతే కాకుండా కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయని, కావున ప్రజాప్రతినిధులు కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఎంతో మాట్లాడి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో భీమయ్య, శాంతమ్మ, వెంకటమ్మ, జిలాని, రవి, నర్సింహులు, జగన్, కిష్టప్ప, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

వెంటనే ఐఆర్ ప్రకటించాలి



జుంటుపల్లిలో సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న సంఘం నేతలు

- పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి

యాలాల: ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి(ఐఆర్)ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను తక్షణమే మంజూరు చేయాలని, ప్రభుత్వ హెల్త్ స్కీంను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్‌ల ఆధ్వర్యంలో వివిధ క్లస్టర్ల పాఠశాలల్లో సభ్యత్వ నమోదును నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం సభ్యుడు మొగులయ్య, పరమేష్, కృష్ణారెడ్డి, రమేష్, పార్వతీ దేవి, రాధబాయి, మహమూద్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు వృథా

దోమ: మండల కేంద్రం కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాల సమీపంలో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. వారం రోజులుగా నీరు పక్కనే ఉన్న పంటపొలాల్లోకి పోతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు, స్థానికులు చెప్పారు. నీటి వృథాకు కారణం నాసిరకం పైపులే అని, సంబంధిత అధికారులు స్పందించి, నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.



పాఠశాల సమీపంలో వృథాగా పోతున్న నీరు

సంక్షిప్త వార్తలు

◆ **విద్యార్థుల ఆధార్ అప్‌డేట్**



ఆధార్ అప్‌డేట్ చేస్తున్న ఏజెన్సీ సిబ్బంది

కొడంగల్ రూరల్: మండల పరిధి చిన్ననందిగామ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం శరణ్ మాట్లాడారు. విద్యార్థుల ఫొటోతో పాటు, వివరాలు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విరించి ఏజెన్సీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు పెద్దనందిగామ తదితర గ్రామాల్లో విద్యార్థుల ఆధార్ అప్‌డేట్‌ను పూర్తి చేసినట్లు ఏజెన్సీ సిబ్బంది తెలిపారు.

◆ **సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం**



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం కార్మికులు, ఉద్యోగులు

తాండూరు: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ సంస్థ కార్మికులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా తాండూరు ఆర్టీసీ డిపో ప్రాంగణంలో డీఎం సమత ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

◆ **రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి**



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఓ గీత

బంట్వారం: అర్హులైన రైతులు గడువులోగా బీమాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ కోట్‌పల్లి ఏఓ గీత అన్నారు. మంగళవారం బుగ్గాపూర్ రైతు వేదికలో ఆమె రైతుల నుంచి బీమా అర్జీలను స్వీకరించి మాట్లాడారు. జూన్ 18 వరకు కొత్తగా పట్టాదారు పుస్తకం పొందిన వారు అర్హులని, బీమా పత్రానికి పట్టా పుస్తకం, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలు జత చేసి ఏఈఓలకు అందజేయాలన్నారు. ఈ నెల 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ స్వాతి, రైతులు పాల్గొన్నారు.

◆ **విధిగా పన్నులు చెల్లించాలి**

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ విధిగా పన్నులు చెల్లించాలని జీపీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం పలువురు గ్రామస్తుల నుంచి ఇంటి పన్నులను వసూలు చేసి మాట్లాడారు. ఇంటి యజమానులు, దుకాణదారులు పన్నులు చెల్లించి, గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **దాడులను అరికట్టాలి**

మర్పల్లి: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలను అరికట్టాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మర్పల్లి మండలం సిరిపురంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు నిరసన తెలిపారు. సిరిపురం అంగన్‌వాడీ కార్యకర్తలు సులోచన, భారతి, అరుణ, పుష్ప, సుజాత, నిర్మల, శాంత రాములమ్మ, శ్రీకళ, ప్రమీళ పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అందేలా కృషి

- ఎక్కడ ఏ సమస్య ఉన్నా.. వెంటనే పరిష్కరిస్తా
- బస్తీబాటలో ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



పరిగి: ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



పరిగి: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, కార్మికులు

పరిగి: అనుక్షణం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బస్తీబాటలో భాగంగా మంగళవారం పట్టణ కేంద్రంలోని 15,11,12 వార్డుల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యల గురించి ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు చూడాలని సూచించారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, అవి అర్హులందరికీ అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. 12వ వార్డులో నీటి సమస్య ఉండటంతో వెంటనే బోరు వేయించారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులకు భోజనం వడ్డించారు. ప్రతి ఒక్కరు కష్టపడి చదువుకోవాలని, ప్రభుత్వం అన్ని సౌకర్యాలను అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, కౌన్సిలర్లు రవీందర్, మునీర్, కృష్ణ, తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

హర్షించదగిన విషయం

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం హర్షించదగిన విషయమని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. పరిగి పట్టణం ఆర్టీసీ డిపోలో డీఎం పవిత్ర, ఉద్యోగులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటూ, సంస్థను బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్ రెడ్డి, ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఆదుకుంటాం

దోమ: బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలను తాము అన్ని విధాలా ఆదుకుంటానని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. దోమ మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త అనంతయ్య అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. జెడ్పీటీసీ నాగిరెడ్డితో కలిసి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పొందుతున్న బాధితున్ని పరామర్శించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సొంత ఖర్చులతో అంబులెన్సును ఏర్పాటు చేయించి, మెరుగైన వైద్యం కోసం నగరంలోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, వైస్ ఎంపీపీ మల్లేశం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్ గౌడ్, పరిగి మండల అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్, నేతలు అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.